

# అమెరికా అన్నయ్యలు

ఇచ్ఛాపురపు రామచంద్రం

వాషింగ్టన్ డి.సి. వెళ్ళవలసిన పెద్ద అన్నయ్యనూ, టెక్సాస్ వెళ్ళవలసిన చిన్నన్నయ్యనీ విశాఖపట్నం వరకు టాక్సీలో తీసుకెళ్ళి విమానం ఎక్కించి, వీడ్కోలు చెప్పి అదే టాక్సీలో అనకాపల్లి తిరిగివచ్చాను. అలసటగా ఉంది. కుర్చీలో కూలబడ్డాను.

అమ్మ వొణికింది నాచేయి పట్టుకుని.

"వాళ్ళు వెళ్ళిపోయారా?"

"ఊఁ. హైదరాబాద్ మీదుగా బొంబాయి... అక్కణ్ణించి రేపటికి ఇళ్ళు చేరతారు." కాఫీ తాగుతూ మెల్లగా అన్నాను, ప్రయత్నపూర్వకంగా ఆమె ముఖం తప్పించుకుంటూ. అబ్బాయిలిద్దరూ వెళ్ళిపోయినందుకు ఆమె వదనంలో ఎంత విచారం గూడుకట్టుకుని ఉంటుందో నాకు తెలుసు.. ఇంకా ఆమె కంఠంలోని గద్గదికత చెబుతోంది. పార్టింగ్ సీన్స్ ఎప్పుడూ బాధాకరాలే. అవి- మాతాపుత్రుల మధ్య ఐతే మరీని.

నేను సీరియస్‌గా కాఫీ త్రాగడం నటిస్తున్నాను. క్షణాలు భారంగా గడుస్తున్నాయి. హఠాత్తుగా అంది అమ్మ. "నేను ఇంగ్లీషు నేర్చుకుంటాను." అమ్మ మెల్లగానే అంది కాని ఆమె మాటలు పిడుగు పడ్డట్టు ధ్వనించి త్రుళ్ళిపడ్డాను. నేను పొరపాటుగా వినలేదు కదా? ఈ వయసులో ఏభై ఏళ్ళకి- అమ్మ ఆంగ్ల విద్యాభ్యాసం! అరవైలో ఆ ఆలు నేర్చుకోడంలో తప్పేమీలేదు కాని ప్రపంచానికి వింతగా ఉంటుంది. నేర్పేవాళ్ళ వయసుకి హద్దుండదు కాని నేర్చుకునే వయసుకి అంతులుంటాయి. ఏడవయ్యాక యేట అగ్గిగండమని ఆడిపోసుకోరూ పాటివాళ్ళిప్పుడీమె ఇంగ్లీషు నేర్చుకోడం మొదలు పెడితే.

"ఔను, అంతకంటె మరో మార్గం కనిపించడంలేదు" ఆమె కళ్ళలోకి నీళ్ళు వొచ్చేశాయని ఆమె కంఠంలోని గద్గదికతే చెబుతోంది. ఆమె గుండెలోని

దుఃఖానికి ప్రతీకగానే ఉందా రుద్ధకంఠం. ఈ వయసులో అమ్మ ఎంత త్యాగానికి సిద్ధపడిందో తలుచుకుంటే– సిగ్గుతో తల వొంచుకోవాలనిపిస్తోంది కాని– అలాగ వొంచుకోవలసింది నేను కాదు.

"రెండేళ్ళకో మూడేళ్ళకో ఓసారి వొస్తారు. వారేమో పదిరోజులో ఉంటారు. కాని, ఏం లాభం? కళ్ళతో చూసుకుని సంతోషించడమేతప్ప ఒక్క మాట మాట్లాడుకుందు కుండదు. వాళ్ళేం చెబుతున్నారో నా కర్థం కాదు. నేనేం చెబుతున్నానో వాళ్ళకి బోధపడదు. దుబాసి పనిచేసిచేసి నీకు విసుగొస్తుంది."

అమ్మమీద జాలితో నా హృదయం అర్ద్రమైంది. ఎంత చిత్రమైన బాధ! పగవాళ్ళకి కూడా వొద్దు అటువంటి అవస్థ. అమ్మ మీద నాకు మొదటినుంచీ అపరిమితమయిన యిష్టమూ, జాలీ. అన్నయ్యలిద్దరూ– మామయ్య ధర్మమా అని చిన్నతనాలలోనే అమెరికా వెళ్ళిపోయి అక్కడ స్థిరపడిపోయిన మాట నిజమేకాని, పుట్టి పెరిగిన వూరినీ, మాటలు నేర్చిన మొదటిభాషనీ మరచిపోయేంత మరీ చిన్నతనమేమీ కాదు. తొమ్మిదీ పదేళ్ళమధ్య దేశం వొదిలి వెళ్ళారు. నాన్నగారు బ్రతికుంటే నేనూ అలాగే చేసేవాడినేమో. అంతకీ– వొచ్చినప్పుడల్లా అన్నయ్యలిద్దరూ అంటూనే ఉంటారు– "ఈ దర్టీ కంట్రీలో ఏముందని యీ పల్లెటూరిని పట్టుకు వేళ్ళాడతావ్? హాయిగా అమెరికా వొచ్చెయ్...."

రాశేవని బయట కనను ఈ దర్టీ కంట్రీలో– యీ పల్లెటూరు (?) అనకాపల్లికీ అమ్మకీ ఎడతెగని అనుబంధం ఉంది. ఆమె దాంపత్య జీవితమంతా యిక్కడే గడిచింది. చాలామంది తెలిసిన వాళ్ళు కావడంతో ఆమెకిక్కడొక రకమయిన విలువా గౌరవమూ ఉన్నాయి. అది– ఆమె సెంటిమెంటు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అని ఆమె మనస్ఫూర్తిగా నమ్ముతుంది అంతేకాదు– అమెరికాలో అంటూసొంటూ ఆచారాలూ ఉండవని ఆమె భయం. నాన్నగారికి తద్దినం పెట్టేందుకు బ్రాహ్మణుడు దొరకడని ఆమెకు సందేహం. ఇన్ని కారణాలుగా ఆమె అమెరికా వెళ్ళదు. నవ్వితే నవ్వండి.... అమ్మ వెళ్ళదు కనుక నేనూ వెళ్ళను. అమ్మకి అన్నయ్యలంటే చాలా అపేక్ష.

నెలయ్యేసరికి– "ఉత్తరం వ్రాయి, దేశంకాని దేశంలో ఎలా ఉన్నారో ఏమో.... మనకోసం బెంగెట్టుకుంటారు" అంటూ గుర్తుచేస్తుంది పిచ్చి అమ్మ. అమాయకత్వానికి నాకు జాలీ, నవ్వూ, ఏడుపూ కూడా వొస్తాయి. అమ్మకి నిజం తెలిస్తే?

ఉత్తరాల గురించి అన్నయ్యల థీరీ వేరు. "ఉత్తరం వ్రాయడమంత న్యూసెన్స్ మరొకటుండదు. ఉత్తరం రా(య)లేదంటే క్షేమంగా ఉన్నట్లే లెక్క–"



అంటారు. నాకు కోపం వొస్తుంది చాలా. ఉత్తరాలగురించి అమ్మ ధీరీ వేరు. ఉత్తరం రా(య)లేదంటే ఎటువంటి యిబ్బంది పడుతున్నారో ఉత్తరమయినా రాయలేకుండా అని సందేహం. మీనుంచి ఉత్తరాలు వొస్తుంటేనే ఆమెకి నిశ్చింత. నెలకొకటి వ్రాయండి- అని చెబుదామనుకుంటాను. కాని లాభం ఉండదు వాళ్లు నా కంటే పెద్దవాళ్లు, అన్నయ్యలు.... అమెరికా అన్నయ్యలు. నన్నూ, నా మాటలనీ లెక్కచేస్తారా? నేను తమ్ముణ్ని. వొట్టి ఇండియన్ తమ్ముణ్ని.

వాళ్లదగ్గరనుంచి ఉత్తరం వొచ్చిందా అని నెలనెలకీ అడుగుతుంది. రాలేదని ఆమెను బాధ పెటడం ఇష్టంలేక వొచ్చిందంటాను. "విశేషా లేమీలేవు అంతా క్షేమం" అని చెప్పేస్తాను అప్రియమయిన సత్యం కంటే- ప్రియమయిన అసత్యం మేలు. ఉపకారం చెయ్యనప్పుడు.

"ఉత్తరం ఏదీ?" ఆత్రంగా అడుగుతుంది. గుండెలు పిండేస్తున్నట్లయి- చేతులు వొణుకుతూంటే- గిల్టీగా ఫీలౌతూ పాత ఉత్తరం అందిస్తాను ఫారన్ లెటర్ని ఆమె కానరాలే. ఉత్తరాన్ని ఆత్రంగా చూసుకుంటుంది తరువాత గుండెల కదుముకుంటుంది. ఆదుగో.... అప్పుడే నాకు ఏడుపాపుకోడం చాలా కష్టమౌతుంది. అన్నయ్యలమీద పట్టలేనంత కోపం వొస్తుంది.

"ఈ భాష నా కేమర్థమౌతుంది? తెలుగులో వ్రాయమను యీసారయినా..."

ఎంతో చెప్పాను- అమెరికా అన్నయ్యలకి. మీ ఉత్తరాలకోసం అమ్మ తహతహలాడుతూంటుంది. తెలుగులో వ్రాయండి! చదువుకుని మురిసిపోతుందని.

"తెలుగు మాట్లాడ్డమే మరచిపోయాం, వ్రాయడం కూడానా!" నవ్వేశారు.

"అమెరికాలో తెలుగు రాయడమూ మాట్లాడడమూ మరచిపోని ఆంధ్రులు కొందరయినా ఉంటారనుకుంటాను—"

"వాళ్ల దగ్గరికి వెళ్లి వ్రాయించమంటావా?" ఓ ఫూల్‌ని చూసినట్లు చూశారు నన్ను. అలాగ వ్రాయించుకోడం చాలా పరువుతక్కువ పని ఐనట్లు సూచించారు ముఖాలలో.

ఇక్కడ నేనాడవలసివొస్తున్న అబద్దాలూ నాటకాలూ చెప్పాను, అప్పటికే నా వాళ్ల మనసు కరుగుతుందేమోనని. విని-"థాంక్యూ యంగ్‌బోయ్. నువ్వు తీసుకుంటున్న శ్రమకి- యీసారి మంచి టు యిన్ వన్ తెస్తాంలే. జ్ఞాపకం చెయ్." అనేశారు.

వాళ్లంతే. అమ్మకి కూడా థాంక్స్ చెబుతారు. డబ్బా పాలూ, ఆయా పెంపకాలతో పెరిగే అమెరికాలో వీళ్లూ పౌరులే. అమ్మ అనే పదంలోని తీయదనమూ, అనుబంధమూ, ఆత్మీయతా, ఔన్నత్యమూ వీళ్లకి మాత్రం ఎలా తెలుస్తుంది? వంట సులభంగా అయ్యే ఆధునిక పరికరాలు తెచ్చి యివ్వడంతో ఋణం తీర్చుకున్నామనుకుంటారు తప్ప—ఇటువంటి కానుకలు వందలూ వేలూ కలిపినా యివ్వలేని తృప్తి-ఒక్క చల్లని తెలుగు పలకరింపు వాళ్ల నోట వినవొస్తే అమ్మ పరమానందభరితురాలై పోతుందనీ, పరవశించి పోతుందనీ వాళ్లకి తెలియదు. చెప్పినా నమ్మరు. పేరెంట్ హోమ్ సంస్కృతి కలవాటుపడిన దేశంలో బ్రతుకుతున్నవాళ్లకి అమ్మ సెంటిమెంట్ ఎలా అర్థమౌతుంది?

రమ్మని వ్రాయగా వ్రాయగా - "అక్కడ టి.వి. ఉండదు. ఫ్రెండ్స్ ఉండరు. బోర్ కొడుతుంది-అయినా వొస్తున్నాం-ఫలానా తేదీన-" అంటూ యిద్దరూ కలిసి ఒకే ఉత్తరం వ్రాస్తారు. వ్రాయడమంటే టైపుచేసి- దిగువను యిద్దరూ సంతకాలు చెయ్యడం. ఇందులో మాత్రం ఎక్కడలేని ఐకమత్యమూ ఆ అన్నదమ్ముల మధ్య.

వాళ్లెప్పుడు వొస్తారన్న మాటే కాని-ఏమీ తృప్తి కలగజెయ్యరు. వాళ్లు రాగానే-"వొచ్చారా నాయనా!" అంటూ ఆప్యాయంగా అభిమానంగా పలకరిస్తుంది అమ్మ. "హాయ్!" అంటారు వాళ్లు. తమకని ప్రత్యేకించిన గదిలోకి వెళ్లిపోతారు. ఇంక ఆ ప్రపంచం వేరు. తాగుతూ.... పుస్తకాలు చదువుతూ.... ట్రాన్సిస్టర్ లేదా టేప్‌లు వింటూ కూర్చుంటారు. వాళ్ల వేషాలు చూస్తే అమ్మ గుండె

బ్రద్దలౌతుందని నేను జాగ్రత్తగా రహస్యం కాపాడుతూంటాను. వాళ్లు మాత్రం ఏమీ కేర్ చెయ్యరు.

అబ్బాయిలొచ్చారన్న ఆనందంలో- ఏవేవో పిండివంటలు చేస్తుంది అమ్మ. బూరెలు-టూ స్వీట్ అనీ, పులిహర టూ హాట్ అనీ నోటపెట్టరు. పైగా కట్లెట్లూ, సాండ్‌విచెసూ, బ్రెడ్ టోస్టులూ, ఎగ్ రోల్సూ లేవూ అని అడుగుతారు. వాళ్ల భాష అర్థంకాకపోవడం అమ్మకి మేలుచేసిందనుకుంటాను. అనువదించి చెప్పడంలో- అమ్మకి బాధ కలగకుండా చెబుతాను.

ఎంతో ఎటకేట్ తెలుసునంటారు అమెరికా అన్నయ్యలు. కాని అమ్మ ముందు?.... ఇండియన్ అమ్మ ముందు ఎటికేట్ చూపనక్కర్లేదని వాళ్ల ఉద్దేశం కాబోలు. అమ్మ మాట్లాడబోతుంది. అంతలోనే సౌజ్ఞలు చేస్తుంది. వాళ్లు అర్థం చేసుకుందుకు ప్రయత్నించనయినా ప్రయత్నించరు, వాళ్ల మధ్య దుబాసీ అన్న మాటే కాని నేను చేసేదాన్లో అనువాదం తక్కువ. మధ్యవర్తిత్వం ఎక్కువ. వివాదానికి నేను దుబాసీగా కంటె వారధిగానే ఎక్కువ పనిచేస్తాను. మాతృమూర్తి పట్ల అట్టే అభిమానంలేని యీ అమెరికా అన్నయ్యలకి మాతృభాషపట్లా మాతృదేశంపట్లా ఏం ఆదరం ఉంటుంది?

అమెరికా నుంచి వొచ్చారనగానే- వింతలాగ-వొచ్చి చూస్తామంటారు నా మిత్రులు. తీసుకొస్తే వీళ్లకి చిరాకు. తీసుకురాకపోతే వాళ్లు నిష్టూరాలు. మధ్యలో నేను నలిగిపోతాను.

ఇలా గడిచిపోతాయి అన్నయ్యలుండే వారం పదిరోజులూ. వొచ్చిన దగ్గర నుంచీ ఎప్పుడు వెళ్లేదీ ఏ ఫ్లయిటూ చూసుకుంటూనే గడుపుతారు. వాళ్ల ప్రయాణం దగ్గరపడుతుంది.

అమ్మ వాళ్ల పెళ్లిమాటలు మొదలు పెడుతుంది నన్ను వాళ్ల భాషలో వాళ్లకి చెప్పమంటూ. అమ్మ అమాయకత్వం కానీ ఒద్దాలనాటి బిడ్డలు కానీ అమెరికా వెళ్లాక బిడ్డలా? అమ్మ మాటలను నేను యదాతథంగా అనువదించను- ప్రయోజనం శూన్యమని తెలిసి.

“మరో రెండ్రోజులుండమని చెప్పరా...” అంటుంది దానికి వాళ్ల జవాబు నాకు ముందే తెలుసు. “అమెరికా వెళ్లడమంటే అక్కయపాలెం వెళ్లడమా, ఫ్లయిట్లు... రిజర్వేషన్లు ప్చ్... నువ్వీ పల్లెటూళ్లో ఉంటూ బైతువైపోయా” వనేస్తారు-ఇద్దరూ మహా ఐకమత్యంగా. బుద్ధిగా వాళ్లని విశాఖవరకు టాక్సీలో తీసుకెళ్లి విమానం ఎక్కించి వొస్తాను.

ఇప్పుడూ అలాగే వొచ్చాను.

ఐతే-అమ్మ యిన్నాళ్లూ కోరని కోరిక “ఆంగ్లభాష నేర్చుకుంటా”నని. యిప్పుడెందుకు వ్యక్తంచేసింది? నేనాడిన అబద్ధాలూ, నాటకాలూ తెలిసిపోయాయా? అమ్మకీ అమెరికా అన్నయ్యలకీ మధ్య

నేను సరిఅయిన వారధిగా నిలవలేక పోయానా? ఊహూ.... అది కాకపోవచ్చు. ఈపాటికి అమ్మకి స్పష్టంగా అర్థమై పోయి ఉంటుంది-వాళ్లిద్దరూ తనకోసం తెలుగు నేర్చుకోరనీ, తనతో తెలుగు మాట్లాడరనీ, తెలుగులో ఉత్తరాలు వ్రాయరనీ.

మహమ్మదు-కొండదగ్గరకి రాకపోతే కొండే మహమ్మదు దగ్గరకు వెళ్లడం కంటే మార్గాంతరం లేదని-అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాక-

ఆమె అమృతమయీ ఉన్నతురాలూ అయిన అమ్మ కన్నకొడుకుల కోసం పంతాలూ పట్టింపులూ పోక, అభిమానమూ ఆత్మగౌరవమూ అని ప్రాకులాడక-

తనే వాళ్ల భాష నేర్చుకుందుకు సంసిద్ధురాలయింది. నా కామెమీద జాలీ, అన్నయ్యల మీద కోపమూ కూడా తారస్థాయి నందుకున్నాయి. కాని ఏదీ ప్రదర్శించ లేని అసహాయుణ్ని.

నే ననుకున్నాను అమ్మది ఆరంభ శూరత్వమేమో అని, అలా కావాలని అంతరాంతరాలలో కోరుకున్నాను కూడా. కాని-ఓ వారం చూసి-ఆమె పక్కింటి ఉపాధ్యాయుణ్ని ఆ విషయం కదపబోతుంటే పమయావి కద్దుపడి-

"నేనే చెబుతానే అమ్మా!" అన్నాను.

"అంతకంటేనా!" అంటూ ఆమె కొత్త పలకా బలపమూ పట్టుకువొచ్చింది. ఎప్పుడు కొన్నదో నాకు తెలియకుండా!

అక్షరాలు వ్రాసియిస్తూంటే- నా చెయ్యి వణికింది. నా గుండె తొణికింది.

అమ్మ-ఎబిసిడిలు దిద్దుతూంది దీక్షగా, అమెరికా అన్నయ్యల కోసం.

నా హృదయం ఉద్వేగం చెందుతూంది, ఒక్కసారి ఆ ఉన్నతురాలిపాదాల మీద పడి సాష్టాంగ దండప్రణామం చేయాలని.

